## క్లుప్తంగా

### ఘనంగా ఏఈఎల్‌సీ వ్యవస్థాపక దినోత్సవం



**అమరావతి:** ఆంధ్ర సౌవార్తిక లూథరన్ సంఘం 183వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ధరణికోట క్రీస్తు లూథరన్ చర్చిలో సంఘ కాపరి రెవరెండ్ ఆలూరి సత్యానంద కుమార్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గుంటూరు వెస్ట్ ప్యారిస్ పాస్టర్ గనుపల్లి సతీష్ బాబు మాట్లాడుతూ అమెరికా లూథరన్ మిషనరీ ఫాదర్ హెయ్యర్ గుంటూరుకు వచ్చి విద్య వైద్య సామాజిక రంగాలలో హెయ్యర్ ఎనలేని కృషి చేశారన్నారు. అందుకే అయన గుంటూరుకు వచ్చిన రోజును సువార్త దినోత్సవం గా జరుపుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘపెద్దలు, క్రీస్తు ఆరాధకులు పాల్గొని ప్రత్యేక ప్రార్ధనలు చేశారు.

### నకరికల్లు పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ ఆకస్మిక తనిఖీ



**నకరికల్లు:** ఫిర్యాదులు సకాలంలో పరిష్కరించడంతో పాటు వచ్చిన ఫిర్యాదుదారులకు స్పదించాలని ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆదేశించారు. నకరికల్లులోని పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఎస్‌ఐ కె.నాగేందర్ రావుతో పాటు సిబ్బందితో మాట్లాడి వివరాలు సేకరించారు. పలు సూచనలు చేశారు. పల్నాడు ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి రావడంతో ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సందర్భంగా ఎస్పీ సిబ్బందితో మాట్లాడుతూ రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని, పెండింగ్ కేసులు లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కారం చేసుకోవాలని, సివిల్ సంబంధిత కేసుల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సిబ్బంది ఉన్నారు.

### నాణ్యమైన భోజనం అందించాలి

**పెదకూరపాడు:** ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి విద్యార్థికి నాణ్యమైన భోజనం అందించాలని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అర్తిమళ్ల రమేష్ కోరారు. మండలంలోని 75 త్యాళ్లూరు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులకు భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షుడు జి.బాబూరావు, టీడీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు ప్రతాప్, సుందర రామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, అమరారెడ్డి, పోతిరెడ్డి, భాష్యం రాములు, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

### అన్న క్యాంటీన్ పనుల పరిశీలన



**సత్తెనపల్లి:** రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 15న 100 అన్న క్యాంటీన్‌లను ప్రభుత్వం ప్రారంభించనున్న నేపథ్యంలో పట్టణంలోని తాలూకా సెంటర్‌లో అన్న క్యాంటీన్ పున:ప్రారంభ పనులను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ గురువారం పరిశీలించారు. అన్న క్యాంటీన్ లోపల చేపట్టిన పనులను పరిశీలించి, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, తదితరులు ఉన్నారు.

### పెదకూరపాడు తహసీల్దారుగా డానియేలు



**పెదకూరపాడు:** పెదకూరపాడు తహసీల్దారు డానియేలు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయం సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. డానియేలు గతంలో గురజాల తహసీల్దారుగా పనిచేస్తూ ఎన్నికల విధుల్లో భాగంగా ప్రకాశం జిల్లాకు బదిలీ అయ్యారు. అనంతరం బదిలీల్లో భాగంగా పెదకూపాడు తహసీల్దారుగా గురువారం బాధ్యతలు స్వీకరించారు. డెప్యూటీ తహసీల్దారు లక్ష్మీకుమారి, రెవెన్యూ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

### రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

**క్రోసూరు:** అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ ఎస్ఎం షఫీ గురువారం తెలిపారు. అచ్చంపేట మండలం కోనూరు ఇసుక రీచ్ నుంచి గుడిపూడికి వెళ్తుండగా సీజ్ చేసినట్లు చెప్పారు. రెండు ట్రాక్టర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

# నవజాత శిశువుకు ముర్రిపాలు సురక్షితం



సీమంతం అనంతరం గర్భిణులతో పీడీ, పీవో, సూపర్‌వైజర్లు



మాదలలో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.జయలక్ష్మి

**రాజుపాలెం:** పుట్టిన బిడ్డకు వెంటనే తల్లి ముర్రిపాలు ఇవ్వడం వల్ల బిడ్డ భవిష్యత్తులో ఆరోగ్యంగా ఉంటుందని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి కె.ఉమాదేవి అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో తల్లి పాల వారోత్సవాల సందర్భంగా గర్భిణులకు గురువారం సీమంతం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ ముర్రిపాల ప్రాముఖ్యతను గురించి వివరించారు. మూఢ నమ్మకాలు వదిలి పుట్టిన బిడ్డకు తల్లి ముర్రిపాలు ఇవ్వాలని, దీని వల్ల పిల్లలు బలిష్ఠంగా తయారవుతారని తెలిపారు. సత్తెనపల్లి సీడీపీవో పి.శ్రీలత మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే పుట్టే బిడ్డలు కూడా ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. అనంతరం గర్భిణులకు సీమంతం నిర్వహించి, సారె అందించారు. ఈ కార్యక్రమంలో ఏసీడీసీవో టి.సంతోషకుమారి, ఎంపీడీవో రామకృష్ణప్రసాద్, ఎంఈవో-1 నరసింహారావు, హెల్త్ సూపర్‌వైజర్ ఉషారాణి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కె.రమాదేవి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**మాదలలో తల్లిపాల వారోత్సవాలు**

**మాదల(ముప్పాళ్ళ):** ప్రపంచ తల్లి పాల వారోత్సవాలలో భాగంగా మాదల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు, గర్భిణులకు తల్లి పాల ప్రాముఖ్యతపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జీ.జయలక్ష్మి పాల్గొని పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించటం వల్ల రోగ నిరోధకశక్తి పెరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్ పీటర్ డేమియన్, సీహెచ్ఓ పావని, శాంతి, ఏఎన్ఎం అన్నమణి, రామమ్మ, అంగన్‌వాడీకార్యకర్తలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



గోడ పత్రికలు ఆవిష్కరిస్తున్న డాక్టర్ అంకమ్మబాయి

**తల్లిపాల వారోత్సవాల గోడ పత్రిక ఆవిష్కరణ**

**రాజుపాలెం:** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తల్లిపాలు వారోత్సవాల సందర్భంగా డాక్టర్ ఎస్.బాల అంకమ్మబాయి, సిబ్బంది గోడ పత్రికలను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ తల్లి పాలు అత్యంత సురక్షితమైనవని, తల్లిపాలలో బిడ్డకు కావల్సిన అన్ని రకాల పోషకాహారం బిడ్డకు అందుతుందని తెలిపారు. తల్లిపాలు వారోత్సవాలు ఈ నెల 7వ తేదీ వరకు ప్రతీ గ్రామంలో జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, ఆశా నోడల్ అధికారి ఉషారాణి, స్టాఫ్‌నర్సులు చందన,రమాదేవి, సీహెచ్‌వోలు లక్ష్మీదుర్గా, తేజశ్విని, మాదవి, ప్రియదర్శిని, శిరీషాభాయి, హెల్త్ అసిస్టెంట్ కోటేశ్వరరావు, ఆశా కార్యకర్తలు నామాల ప్రసన్న, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## అమరావతి తహసీల్దారుగా నాగమల్లేశ్వరరావు



సత్తెనపల్లి ఆర్డీఓ మురళీకృష్ణను కలిసి మొక్కను అందిస్తున్న తహసీల్దారు శ్రీనివాస చక్రవర్తి



తహసీల్దారు నాగమల్లేశ్వరరావు



తహసీల్దారు శ్రీనివాసయాదవ్



తహసీల్దారు కె.పుల్లారావు



తహసీల్దారు దుర్గేష్‌రావు

**అమరావతి:** మండల తహసీల్దార్‌గా నూతనంగా నియమితులైన ఎస్.నాగమల్లేశ్వరరావు గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన వెంకటరమణారావు నెల్లూరు జిల్లాకు బదిలీ కాగా గతంలో యడ్లపాడు మండల తహసీల్దార్‌గా పనిచేసిన నాగమల్లేశ్వరరావు నూతన తహసీల్దార్‌గా డెప్యూటీ తహసీల్దార్‌గా పదవీ భాధ్యతలు స్వీకరించారు. అనంతరం అయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని, ప్రజలకు అందు బాటులో ఉంటానన్నారు.

**అచ్చంపేట తహసీల్దారుగా శ్రీనివాసయాదవ్**

**అచ్చంపేట:** అచ్చంపేట తహసీల్దారుగా జి.శ్రీనివాసయాదవ్ గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ప్రవీణ్‌కుమార్ నెల్లూరు జిల్లాకు బదిలీ అయ్యారు. శ్రీనివాసయాదవ్ కారంపూడి మండల తహసీల్దారుగా పనిచేస్తున్న ఎన్నికల విధులలో భాగంగా తిరుపతి జిల్లా, గూడూరు డివిజన్, వెంకటగిరి నియోజకవర్గంలోని డెక్కిలి మండలానికి వెళ్లారు. అక్కడి నుంచి అచ్చంపేట మండలానికి బదిలీపై వచ్చారు.

**సత్తెనపల్లి తహసీల్దారు శ్రీనివాస చక్రవర్తి**

**సత్తెనపల్లి:** సాధారణ బదిలీల్లో భాగంగా సత్తెనపల్లి తహసీల్దార్‌గా కె.శ్రీనివాస చక్రవర్తి గురువారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ప్రకాశం జిల్లా నుంచి బదిలీ పై ఆయన ఇక్కడికి వచ్చారు. గతంలో పిడుగురాళ్ల తహసీల్దార్‌గా, సత్తెనపల్లిలో పౌరసరఫరాల డెప్యూటీ తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహించారు. సత్తెనపల్లి ఆర్డీవో వి.మురళీకృష్ణను మర్యాద పూర్వకంగా కలిశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ కె.ఎస్.చక్రవర్తిని స్థానిక రెవెన్యూ అధికారులు మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం తహసీల్దారు మాట్లాడుతూ రెవెన్యూ పరమైన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

**నకరికల్లు తహసీల్దారుగా కె.పుల్లారావు**

**నకరికల్లు:** మండలంలో పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యల పరిష్కారం దిశగా అడుగులు వేస్తామని తహసీల్దార్ కె.పుల్లారావు పేర్కొన్నారు. నకరికల్లు నూతన తహసీల్దార్‌గా కె.పుల్లారావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటామన్నారు. అన్నిగ్రామాల వీఆర్వోలు, వీఆర్ఏలు, సర్వే సిబ్బంది సమన్వయం చేసుకొని పనిచేస్తామన్నారు. ఆయనకు పలువురు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

**క్రోసూరు తహసీల్దార్‌గా జి.సుజాత**

**క్రోసూరు:** మండల తహసీల్దారుగా జి.సుజాత నియమితులయ్యారు. పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. ఎన్నికల విధుల అనంతరం అధికారుల బదిలీల్లో భాగంగా సుజాత క్రోసూరు తహసీల్దార్ గా నియమితులైనట్లు తెలిసింది. శుక్రవారం విధుల్లో చేరుతారని సమాచారం.

**రాజుపాలెం తహసీల్దారుగా దుర్గేష్‌రావు**

**రాజుపాలెం:** రాజుపాలెం నూతన తహసీల్దారుగా ఎస్. దుర్గేష్‌రావు గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన తహసీల్దారు పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సెక్షన్ ఏవోగా పనిచేస్తూ బదిలీపై వచ్చారు. రైతులకు అందుబాటులో ఉండి రెవెన్యూ సమస్యలను వెంటనే పరిష్కరిస్తానని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

### ఆర్డీఓ కార్యాలయ డీఏఓగా చంద్రారెడ్డి

**సత్తెనపల్లి:** సాధారణ బదిలీల్లో భాగంగా సత్తెనపల్లి ఆర్డీఓ కార్యాలయ డివిజన్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా ఏవీపీ.చంద్రారెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నెల్లూరు జిల్లా నుంచి బదిలీ పై ఆయన ఇక్కడికి వచ్చారు. గతంలో నరసరావుపేట ఆర్డీఓ కార్యాలయంలో డీఏఓగా బాధ్యతలు నిర్వహించారు. సత్తెనపల్లి ఆర్డీవో వి.మురళీకృష్ణను మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన డీఏఓ చంద్రారెడ్డిని కార్యాలయ సిబ్బందితో పాటు పలువురు రెవెన్యూ అధికారులు మర్యాద పూర్వకంగా కలిశారు.

### ఎస్సీ వర్గీకరణపై కోర్టు అభిప్రాయం హర్షణీయం

**నకరికల్లు:** ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధమైనదే అంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు హర్షణీయమని పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రాం చిత్రపటాలకు పూలమాలలు వేసి గురువారం నివాళులు అర్పించారు. ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో 30 ఏళ్ల సుదీర్ఘపోరాటానికి ఫలితం దక్కిందన్నారు. ఉద్యమంలో ప్రాణ త్యాగం చేసిన వారికి జోహార్లంటూ నివాళులు అర్పించారు. ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కోటేశ్వరరావు, ప్రముఖ న్యాయవాది జి.కన్నారావు, ఆనందరావు, సంసోను, నోవాకు, యిస్మాయిల్, పౌలు పాల్గొన్నారు.

### నేడు వంద అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ

**నరసరావుపేట రూరల్:** జాతీయ జెండా రూపశిల్పి పింగళి వెంకయ్య 148వ జయంతి సందర్భంగా మేదమెట్ల అంజమ్మ మస్తాన్‌రావు మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో ఈనెల 2వ తేదీన పట్టణంలో వంద అడుగుల జాతీయ జెండా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు కళాశాల ఛైర్మన్ ఎంఆర్ శేషగిరిరావు గురువారం తెలిపారు. పీఏన్‌సీ కళాశాల నుంచి గడియార స్తంభం వరకు ర్యాలీ జరుగుతుందని వివరించారు.

# 98శాతం పింఛన్ల పంపిణీ

**ముప్పాళ్ళ:** మండలంలో 98 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయినట్లు ఎంపీడీవో శ్రీకృష్ణ గురువారం తెలిపారు. మొత్తం 6,208 మంది లబ్ధిదారులకు గాను 6,088 మందికి పింఛన్ల సొమ్ము అందించామన్నారు. గోళ్ళపాడు, ముప్పాళ్ళ గ్రామాల్లో జరిగిన పింఛన్ల పంపిణీ ప్రక్రియను ఇన్‌చార్జి తహసీల్దార్ సీహెచ్‌లక్ష్మీప్రసాదు పరిశీలించారు.

**పింఛన్ల పంపిణీ**

**సత్తెనపల్లి:** ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను సత్తెనపల్లి శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ గురువారం పంపిణీ చేశారు. పట్టణంలోని 10వ వార్డ్, సత్తెనపల్లి మండలం నందిగామ గ్రామంలో ఆయన ఇంటింటికీ పింఛన్లను పంపిణీ చేశారు. పట్టణంలో మొత్తం 6,301 పింఛన్లకు గాను రూ. 2.70 కోట్లు విడుదల కాగా గురువారం 6,170 మందికి రూ. 2,62,36,000 పంపిణీ చేశారు. 98 శాతం పంపిణీ పూర్తయినట్లు మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి తెలిపారు. అలాగే సత్తెనపల్లి మండలంలో మొత్తం 10,848 మంది పెన్షన్‌దారులకు గాను రూ.4,59,40,500 విడుదల కాగా గురువారం 10,558 మంది లబ్ధిదారులకు రూ.4,46,99,000 పంపిణీ చేశారు. 97.3 శాతం పంపిణీ పూర్తయినట్లు ఎంపీడీవో ఎస్.జగదీష్ తెలిపారు. ఆయా కార్యక్రమా ల్లో మున్సిపల్ మాజీ ఛైర్మన్ యెల్లినేడి రామస్వామి, నాయకులు తదితరులు ఉన్నారు.

**ప్రతి ఒక్కరికి పింఛన్ అందజేయడమే లక్ష్యం**

**పెదకూరపాడు :** అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి వలంటీర్ వ్యవస్థ లేకుండానే ఉదయాన్నే పింఛను అందజేయడమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యంగా పెట్టుకున్నారని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. మండలంలోని



పింఛన్లు పంపిణీ చేస్తున్న ఇన్‌చార్జి తహసీల్దార్ సీహెచ్‌లక్ష్మీ ప్రసాదు

హుస్సేన్ నగర్ గ్రామంలో పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్‌తో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ కార్యదర్శి అర్తిమళ్ల రమేష్, జిల్లా రైతు సంఘం నాయకులు భాష్యం ఆంజనేయులు, మహిళ కార్యదర్శి లీలావతి పాల్గొన్నారు. టీడీపీ జిల్లా కార్యదర్శి షేక్ కరీమున్ పెదకూరపాడులోని ముస్లిం మైనార్టీ సెంటర్‌లో పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే భాష్యం పింఛన్ల పంపిణీ**

**బయ్యవరం(క్రోసూరు):** మండలంలోని బయ్యవరం గ్రామంలో పెదకూరపాడు శాసనసభ్యుడు భాష్యం ప్రవీణ్, మాజీ శాసనసభ్యుడు కొమ్మాలపాటిశ్రీధర్ గురువారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేసారు. ఈసందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పెన్షన్ లబ్ధిదారులందరికీ ఇంటికి చేరేలా పెన్షన్లు అందచేస్తున్నారని, పెన్షన్ దారులు పెన్షన్లు తీసుకుని సంతోషంగా జీవించాలని కోరారు క్రోసూరులో ఎమ్మెల్యే సతీమణి భాష్యం లావణ్య పెన్షన్ల పంపిణీలో పాల్గొన్నారు.



10వ వార్డులో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



పింఛను నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, కొమ్మాలపాటి శ్రీధర్

**95 శాతం పెన్షన్ల పంపిణీ**

**అచ్చంపేట:** మండలంలో గురువారం గ్రామ సచివాలయాల సిబ్బంది, సచివాలయ సిబ్బందితో 95 శాతం పెన్షన్ల పంపిణీ పూర్తిచేసినట్లు ఎంపీడీవో కుసుమకుమారి తెలిపారు. మండలంలో మొత్తం 8,908 మంది పెన్షను దారులు ఉండగా గురువారం సాయంత్రానికి 8,559మంది పెన్షను దారులకు గ్రామ సచివాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది ఇంటిటికీ వెళ్లి పెన్షన్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. మిగిలిన 5శాతం గ్రామాలలో లేకపోవడం, తమ సిబ్బంది ఇంటికి వెళ్లినప్పుకు అందుబాటులో లేకపోవడం వల్ల మిగిలిపోయాయన్నారు మిగిలిపోయినవారికి శుక్రవారం కూడా పంపిణీ చేస్తామని చెప్పారు.

## ఇంటర్మీడియెట్ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

**బెల్లంకొండ:** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు గురువారం ఉచిత పాఠ్యపుస్తకాలు, బ్యాగులను పంపిణీ చేశారు. ప్రభుత్వం నుంచి సరఫరా చేసిన పుస్తకాలను పంపిణీ చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి బాలసుందరరావు తెలిపారు. కళాశాల స్థాయిలో నోటు పుస్తకాల కొనుగోలు విద్యార్థుల తల్లిదండ్రులకు భారంగా కాకూడదనే విషయాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం నోట్ పుస్తకాలు, బ్యాగులను సరఫరా చేసిందని తెలిపారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ శారదాదేవి, అధ్యాపకులు రత్నకుమారి, సత్యప్రభ, కుసుమకుమారి, రమేష్, సిఆర్పి నరసింహారావు పాల్గొన్నారు.

# గర్భకోశ వ్యాధులకు ఉచిత చికిత్స శిబిరం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న జిల్లా పశుగణాభి వృద్ధి సంస్థ ఈఓ డాక్టర్ బాలశంకరరావు

**సత్తెనపల్లి:** పశుసంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సత్తెనపల్లి మండలం లక్కరాజు గార్లపాడు గ్రామంలో ఉన్న గ్రామీణ పశు వైద్యశాలలో గురువారం ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 50 గేదెలకు గర్భకోశ వ్యాధులకు సంబంధించిన రోగాలను గుర్తించి, వాటికి చికిత్స అందించారు. 15 సాధారణ కేసులు, 25 దూడలకు నులిపురుగు మందులను తాపించారు. సదస్సులో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఈఓ డాక్టర్ బాలశంకరరావు మాట్లాడుతూ లింగ నిర్ధారణ, వీర్యం ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. అనంతరం రైతులకు లవణ మిశ్రమం ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ నరసరావుపేట డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ పి.రామారావు, సహాయ సంచాలకులు డాక్టర్ ఎస్.నరసింహులు, సత్తెనపల్లి సహాయ సంచాలకులు డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ జొన్నలగడ్డ మరియమ్మ, పశు వైద్యులు డాక్టర్ జి చంద్రశేఖర్ రెడ్డి, డాక్టర్ ఎం.పుల్లారెడ్డి, డాక్టర్ జి.శ్రీని వాసరావు, పారాసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 8న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు

**అమరావతి:** మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సమగ్ర శిక్ష ఆంధ్ర ప్రదేశ్ ఉత్తర్వుల మేరకు స్కూల్ మేనేజ్మెంట్ కమిటీల ఎన్నికలు ఈ నెల 8వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎంఈవో-2 శివబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రతి పాఠశాలలో ఎన్నికల నోటిఫికేషన్‌తో పాటు ఓటర్ల జాబితా ను కూడా విడుదల చేశామన్నారు. ఎస్ఎంసీ ఎన్నికల షెడ్యూల్, ఎన్నికల సంబంధించిన వివిధ విధానాలను మార్గదర్శకాలను పాఠశాలలో అందుబాటులో ఉంచామన్నారు. ఓటర్ల జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఆగస్టు 5వ తారీఖు లోగా సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు తెలియజేసి వాటిని సరిచేసుకోవాలన్నారు.

**అచ్చంపేట:** మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో ఈ నెల 8న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు నిర్వహించేందుకు ఎంఈవో ఏకుల ప్రసాదరావు గురువారం ఎన్నికల నోటిఫికేషన్, ఓటర్ల జాబితాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్, సమగ్ర శిక్ష ఆంధ్రప్రదేశ్ ఉత్తర్వుల మేరకు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల షెడ్యూలు, ఎన్నికల విధి విధానాలు, మార్గదర్శకాల మేరకే ఎన్నికలు జరుగుతాయని చెప్పారు.

ఓటర్ల జాబితాపై ఏ విధమైన అభ్యంతరాలున్నా ఈ నెల 5వ తేదీలోపు సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లి వాటిని సరిచేయించుకోవాలన్నారు.

**క్రోసూరు:** మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల ఎన్నికలు జరిపేందుకు గురువారం ప్రతి పాఠశాలలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎంఈవో ఏకుల ప్రసాదరావు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈవో తెలుపుతూ ఎన్నికలు ఆగస్టు ఎనిమిదో తారీకు జరుగుతాయని తెలిపారు. ఓటర్ల జాబితా మీద ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఆగస్టు 5వ తేదీలోగా సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు తెలియజేయాలన్నారు.

## ఇసుక రవాణాలో అక్రమాలు సహించేది లేదు



మాదిపాడు ఇసుక స్టాక్ పాయింట్‌ను తనిఖీ చేస్తున్న తహసీల్దారు శ్రీనివాసయాదవ్

**అచ్చంపేట:** ఇసుక రవాణా ప్రభుత్వ విధానాలకు విరుద్ధంగా అక్రమాలకు పాల్పడితే ఎంతటివారైనా సహించేది లేదని తహసీల్దారు జి.శ్రీనివాసయాదవ్ హెచ్చరించారు. గురువారం తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టగానే మాదిపాడులో ఇసుక డంపింగ్ స్టాక్ పాపయింట్‌ను తనిఖీ చేశారు. స్టాక్ పాయింట్‌లో 45,000 టన్నుల ఇసుక డంప్ చేసి ఉన్నట్లు తెలిపారు. ఈ ఇసుకును పల్నాడు జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు మాత్రమే వినియోగదారులకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఎవరైనా ఇందుకు భిన్నంగా అక్రమంగా స్టాకు పాయింట్ నుంచి రవాణా చేయడం, ఇసుక రీచ్‌ల నుంచి గాని అక్రమంగా నదీలో నుంచి ఇసుకను త్రవ్వడం వంటి చర్యలకు పాల్పడితే ప్రభుత్వ నిబంధనల ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు.

## గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేద్దాం

**ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్**




సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

**అమరావతి:** ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు సమన్వయంతో మండలంలోని గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలని పెదకూరపాడు శాసనసభ్యుడు భాష్యం ప్రవీణ్ అన్నారు. గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగాపాల్గొన్నారు. ఈ సమావేశానికి ఎంపీపీ మేకల హనుమంతరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మండల పరిధి గ్రామాలలో జరుగుతున్న, జరగాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ. అవినీతిని సహించేది లేదని, అవినీతికి పాల్పడినవారు ఎవరైనా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అధికారులతో ప్రజాప్రతినిధులు, నాయకులు స్నేహపూర్వకంగా మసలుకోవాలన్నారు నియోజకవర్గంలో జరిగే మట్టి, ఇసుక తవ్వకాలకు తనకు ఎటువంటి సంబంధం లేదన్నారు. ఎవరైనా అటువంటి వాటికి పాల్పడితే వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యల పరిష్కారానికి వచ్చే వారి నుంచి నగదు వసూళ్లు చేసి ఒక్క రూపాయి అవినీతికి పాల్పడినా వారిని ఉపేక్షించేది లేదని, వారిపై వెంటనే చర్యలు తీసుకుంటానన్నారు. రెవెన్యూ అధికారులు వారి వద్దకు వచ్చే రైతులు తీసుకొచ్చిన సమస్యను వెంటనే పరిష్కరించాలని రైతులు వద్ద నుంచి ఎటువంటి నగదు వసూళ్లు చేయవద్దని తెలిపారు. ఇది అవినీతికి పాల్పడుతున్న అధికారులు హెచ్చరికగా భావించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు మంగిశెట్టి శ్రీనివాసరావు, ఎంపిడివో జి రాణి ఈసమావేశంలో మండల స్థాయి అధికారులు , ఎంపిటీసీలు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**తల్లిపాల వారోత్సవాలను విజయవంతం చేయాలి**

వారం రోజుల పాటు ప్రభుత్వం నిర్వహించే తల్లిపాలవారోత్సవాలను విజయవంతం చేయాలని శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ అన్నారు. ఈ సందర్భంగా తల్లిపాల వారోత్సవాలకు సంబంధించిన బ్యానర్, వాల్ పోస్టర్స్ ఆయన ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో అత్తలూరు వైద్యాధికారులు మౌనిక, శివ రత్న కుమార్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ దేవతలకు ఆషాఢం సారె సమర్పణ



నందిగామలో గ్రామ దేవతలకు ఆషాఢం సారె సమర్పణకు బయలు దేరిన ముత్తైదువులు

**సత్తెనపల్లి:** ఆషాఢం మాసం పురస్కరించుకొని సత్తెనపల్లి మండలం నందిగామ గ్రామ దేవతల ఆశీస్సులు ప్రజలకు ఉండాలని అమ్మవార్లను వేడుకున్నారు. గ్రామంలోని ముత్తైదువులు, భక్తులు ఆషాఢ మాసం అమ్మవారికి సారె అంటూ ఎంతో అంగరంగ వైభవంగా కనక తప్పెట్ల మేళాలతో శ్రీ గోవిందమాంబ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి దేవస్థానం వద్ద గురువారం విశేష పూజలు నిర్వహించారు. గ్రామ అభివృద్ధి కొరకు, పాడి, పంట, పశు, శిశు సమృద్ధి కొరకు ఆలయ అర్చకులు పవన్ శర్మ పూజలు నిర్వహించారు. భక్తుల అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానం వద్ద నుంచి ప్రదర్శన పూర్వకంగా గ్రామంలో జై వీర బ్రహ్మ .. జై గోవింద మాంబ .. జై ఈశ్వరీ తల్లి .. జై భూలోక మాత .. జై ... అంటూ గ్రామంలో ఉన్న దేవతామూర్తులకు సారె సమర్పణ చేశారు. అనంతరం దేవస్థానం వద్దకు చేరుకొని తీర్థప్రసాదాలు స్వీక రించారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్య వేక్షించారు.

**• జలశక్తి అభియాన్‌పై అవగాహన**

**వినుకొండ(నూజెండ్ల):** స్థానిక వెలుగు కార్యాలయంలో జలశక్తి అభియాన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. నీటి విలువల గురించి తెలియజేశారు. గ్రామాల్లోని సిబ్బంది జలశక్తి అభియాన్‌పై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. అనంతరం మహిళా సంఘాలతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.